క్లుప్తంగా

కొండలమ్మ సన్నిధిలో పౌర్ణమి పూజలు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి ప్రత్యేక పూజలను గురువారం వేద పండితులు నిర్వహించారు. అనంతరం చండీ హోమాన్ని వేద మంత్రోచ్చరణ నడుమ జరిపించారు. పౌర్ణమిని పురస్కరించుకొని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి, కమిటీ ధర్మకర్తలు, ఆలయ అర్చకుడు శరత్ శ్చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం



సరోజిని(ఫైల్)

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరుకు చెందిన అడుసుమిల్లి సరోజిని(72) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గురువారం ఆమె మృతి చెందగా.. భౌతిక ఖాయం నుంచి లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వారు నేత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనన్నే రక్ష

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- గౌడపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కృష్ణాపురం శివారు గౌడపాలెంలో బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మహిళా సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నవరత్నాలతో లబ్ధి పొందిన మహిళలంతా సీఎం జగన్‌ను సోదరుడిలా, తోబట్టువులా ఆదరిస్తున్నారన్నారు. మండలంలో కృష్ణాపురం పంచాయతీ పరిధిలోని గౌడపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొలుత గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. సమస్యలు తెలుసుకొని, ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విపులంగా వివరించారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. గౌడపాలెం రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. గౌడపాలెంలో రూ.20 లక్షల వ్యయంతో కొంతమేర రహదారి నిర్మాణం పూర్తి చేసినందుకు ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని, రానున్న ఎన్నికల్లో ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ వీరంకి బలుసలమ్మ, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మర్రి దుర్గారావు, గుర్విందపల్లి వంశీ, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్, పార్టీ నాయకులు ఏనుగ మస్తాన్‌రావు, కాగిత శ్రీరామమూర్తి, యార్లగడ్డ శివ, కల్యాణ్, శ్యామ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఐనపూరులోనూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. సర్పంచ్ కొండా జయలక్ష్మి, ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేసి, సంక్షేమ పథకాలను వివరించారు.

ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట



ముస్లింలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆయూబ్ ఖాన్

గుడ్లవల్లేరు: ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ అన్నారు. గురువారం డోకిపర్రు, లంకాదొడ్డి, మీర్జాలపాలెం మసీదుల్లో హర దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇమామ్‌లు, మౌజాలకు ప్రతి నెలా ఇచ్చే గౌరవ వేతనాలతో పాటు షాదీ తోఫా కింద నూతన వధూవరులకు రూ.లక్ష ప్రోత్సాహకాన్ని అందిస్తున్న జగన్ ప్రభుత్వం ముస్లిం ప్రజల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఆయూబ్ ఖాన్ అన్నారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు రహీం, పెడన పట్టణ సచివాలయాల కన్వీనర్ మతిన్‌ఖాన్, పార్టీ ముస్లిం నాయకులు షేక్ నూరుద్దీన్, అబ్దుల్ నూరుద్దీన్, సమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత నోబుల్‌కు సోదర వియోగం

పలువురు ప్రముఖుల పరామర్శ



దొడ్డిపట్లలో ఇస్రాయేలు పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొడ్డు నోబుల్ సోదరుడు బొడ్డు ఇస్రాయేలు (50) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం ఆయన విజయవాడకు వెళ్లారు. అక్కడ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టంతో మెదడుకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం మణిపాల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామమైన కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి మృతదేహాన్ని తీసుకుచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పెద్ద కుమారుడు వినయ్‌లు సోదరుడు బొడ్డు నోబుల్, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బాలరామరాజు, కై కలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, దొడ్డిపట్ల ఉపసర్పంచ్ నాగనబోయిన సురేష్, డాక్టర్ జాన్ విక్టర్, పాట్రిక్ పాల్, దోమ సాల్మన్ రాజు, కోన జయరాజు తదితరులు నివాళులు అర్పించారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ఆహ్వానం



ఎమ్మెల్సీ జయమంగళకు ఆహ్వానపత్రాన్ని అందిస్తున్న భీమవరం ప్రబోధ సేవా సమితి సభ్యులు

కైకలూరు: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం శాఖ ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6, 7 తేదీలలో భీమవరం గునుపూడి, నల్లంవారితోటలో నిర్వహించే శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకకు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణకు ఆయన నివాసం వద్ద ఆహ్వాన పత్రాన్ని నిర్వాహకులు గురువారం అందించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా భీమవరం శాఖ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ త్రైత సిద్ధాంతం ద్వారా రెండు రోజులు భగవద్గీత శ్లోకాలు భక్తులకు వినిపించనున్నామన్నారు. భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండవల్లి వైస్ ఎంపీపీ ఆది విష్ణు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఈదులమాద్దాలి(పెదపారుపూడి): ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశువర్ధకశాఖ అధికారి ఎంఎస్ దివాకర్ అన్నారు. మండలంలోని ఈదుల మాద్దాలి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగదుల్లో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. గురువారం అంగలూరు గ్రామం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 150 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్లబ్ సభ్యులు ఎం. శివరామకృష్ణ, ఎల్. చిట్టిబాబు బి. కుటుంబరావు వంగపండు బ్రహ్మాజీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆచవరంలో డ్రెయిన్లకు మరమ్మతులు



కైకలూరు: మండల స్థాయి స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆచవరం గ్రామంలో డ్రెయిన్లకు గురువారం మరమ్మతులు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొందరు వీధిలో ఇరువైపులా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో సర్పంచ్ కట్టా నాగరాజు గౌడ్ సమక్షంలో ఈవోపీఆర్డీ రవిశంకర్, కార్యదర్శి కిరణ్ మిని మిషన్‌తో డ్రెయిన్‌కు మరమ్మతులు చేయించారు. గ్రామంలో అత్యవసర పనులను సకాలంలో చేయిస్తామని అధికారులు తెలిపారు.

ఘనంగా విఖనస జయంతి



విశేష పూజలను నిర్వహిస్తున్న శాఖ సభ్యులు

పామర్రు: ఉయ్యూరు వైఖానస శాఖ సంఘం వారి ఆధ్వర్యంలో విఖనస జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీభూ సమేత చెన్న కేశవస్వామివారి దేవస్థానంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. విఖనస జయంతి, లక్ష్మీ హయగ్రీవ జయంతిలను 76వ వార్షికోత్సవాన్ని శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించారు. అనంతరం ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆగమ పాఠశాల ప్రధానాచార్యులు అయిన దీవి వంశీకృష్ణ దంపతులకు ఘనంగా సన్మానించారు. తదుపరి ఆగమ సామాజిక విద్యార్థులకు బహుమతి ప్రదానం తదియారాధన నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు దీవిల క్రీనారాయణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ముత్తేవి యోగలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల చేయూత



ఆధునికీకరించిన కెరియర్ సెల్ తాళాలను యాజమాన్యానికి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గుడివాడ టౌన్: విద్యార్థుల భవిష్యత్తు కోసం స్థానిక అక్కినేని నాగేశ్వరావు కళాశాలలో కెరియర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఏర్పాటు చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు తెలిపారు. గురువారం కళాశాల పూర్వ విద్యార్థులు ఆధునికీకరించిన కెరీర్ సెల్ తాళాలు కళాశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కేఏ అప్పారావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవటానికి కావాల్సిన పరిజ్ఞానం, నైపుణ్యం ఈ కెరియర్ గైడ్ సెల్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అట్లూరి పరంధామారావు, పి. సూర్యచంద్రరావు కళాశాల ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శివనాథ్, గౌరవ సలహాదారు ఎస్. శంకర్, గ్రంథాలయ అధికారిని డీఎస్ఎస్ పద్మజ పాల్గొన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు



రావర్ల(పామర్రు): శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని మండల పరిధిలోని పలు ఆలయాలలో గురువారం విశేషంగా పూజలు చేశారు. మండల పరిధి రావర్లలో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో విశేషంగా అభిషేకాలు, స్నపనలు, పూజలు చేశారు. పంచామృతాలు ఆవుపాలు, ఆవు పెరుగు, నెయ్యి, తేనే, పంచదారలతో నవ రసాలతో విశేషంగా అభిషేకాలను చేశారు. అనంతరం నాగవల్లీలతో ప్రత్యేకంగా శతసహస్ర నామాలతో పూజలను చేశారు. నీరాజన మంత్ర పుష్పాలను ఇచ్చి అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. పామర్రులో వేంచేసియున్న శ్రీ పర్వత వర్ధనీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయలలో రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత సహస్ర నామాలు, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. జమీదగ్గుమిల్లిలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో భక్తులు విష్ణు, లలిత సహస్ర నామ పారాయణ, భగవత్‌గీత పారాయణ, హనుమాన్ చాలీసా పారాయణలను పఠించారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



గుడ్లవల్లేరు: ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. గురువారం అంగలూరులో జల జీవన మిషన్ కింద రూ.25లక్షలతో నూతన మంచినీటి పైపులైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచి మేడేపల్లి రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, ఉప సర్పంచి త్రిపురనేని సురేష్, ఏఈ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



గుడివాడరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైన సంఘటన వలివర్తిపాడు శివారు దొండపాడురోడ్డులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన పామర్తి సుబ్బారావు రెండుపోర్షన్ల పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మంటలు చెలరేగగా స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు పరిసర ప్రాంతాల ఇళ్లకు వ్యాపించకుండా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో పూరిల్లు పూర్తిగా దగ్ధమై రూ.40వేల నగదు, విలువైన పత్రాలు దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

కైకలూరులో డీఎల్‌పీఓ విచారణ




డీఎల్‌పీవోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ నవరత్నకుమారి

కై కలూరు: స్థానిక పంచాయతీకి చెందిన కాంప్లెక్సు దుకాణాలు, పారిశుధ్య కార్మికుల జీతాలు అంశాలపై ఇటీవల స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదుపై ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి విశ్వనాథ శ్రీనివాసరావు పంచాయతీ కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి డీఎల్‌పీవోకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. విచారణలో ఈవోపీఆర్డీ రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీమన్నారాయణ, కిరణ్, జూనియర్ అసిస్టెంట్ రవి, సిబ్బంది శ్యామలరావు పాల్గొన్నారు.

నేత్రదానంపై ర్యాలీ

కంకిపాడు: నేత్రదానం సామాజిక కర్తవ్యమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో జాతీయ నేత్రదాన వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నేత్రదాన ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ.. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జాతీయ నేత్రదాన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

గుడివాడ టౌన్: స్థానిక కొత్తపేటలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ అమ్మవారి దేవస్థానం 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పెద్దపేటకు చెందిన 108 మంది సుహాసినీలు స్థానిక పామర్రు రోడ్డు లోని పెద్ద కాల్వ వద్ద నుంచి కృష్ణమ్మ జలాలను తీసుకువచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఊరేగింపుగా పెద్ద కాలువ సెంటర్ కోతి బొమ్మ సెంటర్ మార్కెట్ సెంటర్ మీదుగా కొత్తపేటకు కృష్ణ జలాలను తరలించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల హనుమంతరావు పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను కమిటీ సభ్యులు పెద్ది రమణ పి. మహేష్ ఎం. రాజు ఎం. ఉమా కొత్తపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



పామర్రులో రాఖీలు కడుతున్న విద్యార్థులు

పామర్రు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా రాఖీ పండుగను గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎన్ఎం హైస్కూల్‌లో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. సోదర భావంతో విద్యార్థులకు రాఖీలు కట్టారు. ప్రతి తరగతిలోని విద్యార్థులకు అమిత ఉత్సాహంతో రాఖీలు కట్టి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పరస్పరం మిఠాయిలు పంచుకొని ఆనందంగా గడిపారు. ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపల్ ఎ. పూర్ణచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: రాఖీ పౌర్ణమి వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో గురువారం ఘనంగా జరిగాయి. సోదర, సోదరీమణుల ప్రేమ, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకున్నారు. అక్కలు తమ్ముళ్లకు, చెల్లెళ్ల అన్నలకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆశీస్సులు అందుకున్నారు. తమ అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలంటూ సందడిగా సెల్ఫీలు దిగారు. రాఖీల అమ్మకాలతో ఫ్యాన్సీ దుకాణాలు, కిరాణా షాపుల వద్ద సందడి నెలకొంది.

ఆనందోత్సాహాలతో..

మండవల్లి: మండలంలో గురువారం ఆనందోత్సాహాలతో రక్షా బంధన్ వేడుకలు జరుపుకున్నారు. రాఖీలు కట్టిన తర్వాత అన్నలు, చెల్లెళ్లకు ప్రీతితో ఏదో బహుమానం అందజేస్తుంటారు. ఈ వేడుకలు మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, కొర్లపాడు, భైరవపట్నం, లోకుమూడి తదితర గ్రామాల్లో ఘనంగా జరిగాయి.

వేడుకగా రాఖీ పౌర్ణమి

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పలువురు మహిళలు, యువతులు వరుసకు సోదరులు అయ్యేవారికి రాఖీలు కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. పలు పాఠశాలల్లోని విద్యార్థులు, చిన్నారులు తమ తోటి వారికి రాఖీలు కట్టి ఆప్యాయతను చాటుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కై కలూరు: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం వరహాపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ గురువారం చెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ, 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నిమిత్తం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.